## పట్టభద్రుల ఎమ్మెల్సీపై పార్టీల నజర్



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 19 అక్టోబరు, 2026 | పేజీలు :08


# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ వేడుకలు

2లో....

తొమ్మిదో రోజున ఘనంగా ముగింపు సంబురాలు
జనసంద్రంగా మారిన పద్మాక్షి,ఉర్సు గుట్ట



## శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో అధికారులు విఫలం

### భద్రకాళి ఆలయం భక్తులకు తప్పని ఇబ్బందులు
### భక్తుల రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు ఎక్కడ..?

**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు.అయితే భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.ఉత్సవాల నిర్వహణలో హడావుడి కనిపిస్తున్నప్పటికీ.. సామాన్య భక్తులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది..ప్రతి ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలకు భద్రకాళి దేవస్థానానికి భక్తుల తాకిడి పెరుగుతోంది.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కూడా అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని భక్తులు చెబుతున్నారు.. ఇంతటి రద్దీ ఉంటుందని తెలిసినప్పటికీ.. అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి..ఉత్సవాల సమయంలో సామాన్య భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని



దర్శించుకునేలా క్యూ లైన్లు, దర్శన నిర్వహణ, హారతి అనంతరం జరిగే సేవలు సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. అయితే క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు.. ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అమ్మవారి

తరువాయి 2లో....

## పూల పండుగకు మురిసిన భూపాలపల్లి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం పూలవనంగా మారింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తుల్లో తరలి వచ్చిన మహిళలు.. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో జిల్లా కేంద్రం పండుగ శోభను సంతరించుకుంది. అంబేద్కర్ గ్రౌండ్‌లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగగా, నగరంలోని పలు కాలనీలు, వార్డుల్లోనూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. పూల పరిమళాలు, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో మైదానం సందడిగా మారింది.



**వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. జంగేడు, కాసింపల్లి, మంజూరు నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు హాజరై మహిళలతో కలిసి పండుగ సంబరాల్లో పాలుపంచుకున్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగలు మన ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**సంప్రదాయాలకు సజీవ సాక్ష్యంగా బతుకమ్మ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు భూపాలపల్లిలో కన్నుల పండువగా సాగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయాలను కాపాడుతూ పండుగను ఘనంగా జరుపుకోవడంతో జిల్లా కేంద్రం అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

## భరతనాట్య గురువు సుజాతకు స్వర్ణ నంది పురస్కారం

**ప్రజాపక్షం / వేలేరు :** హైదరాబాద్ కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రానికి చెందిన భరతనాట్య గురువు చౌదరి మఠం సుజాత సిద్దేశ్వరాకళ్యాణ్ కు విజయ ప్రతిభా స్వర్ణ నంది పురస్కారం–2026 సంవత్సరానికి గాను ప్రదానం చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈకార్యక్రమంలో వీరశైవ జంగమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి పాల్గొన్నారు.

## భద్రకారి సోషల్ మీడియా యాప్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** వరంగల్‌కు చెందిన విజయ్ అనే కిట్స్ కాలేజీ విద్యార్థి భద్రకారి అనేటటువంటి ఒక సోషల్ మీడియా యాప్ ఆవిష్కరించారు. ఇది చాలా గొప్పగా వినూత్న రీతిలో ఆన్‌లైన్ సేవలను కేవలం పట్టణాల్లోనే కాకుండా పల్లెలో కూడా అన్ని రకాల సేవను అందిస్తున్నదని విజయ్ తెలిపారు. ఈ యాప్ యొక్క సేవలను అందరు కూడా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అలాగే స్పాన్సర్ శ్రీ జయశ్రీ పాల్గొన్నారు. అలాగే యాప్ ఒక్క సహాయకులు కోఆర్డినేటర్స్ సుముఖ్, కేరళకు చెందిన జిమో, అలాగే త్రివగ్న, హర్షిత, అనూష, పాల్గొన్నారు.

## అమీర్‌అలీ ఖాన్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సియాసత్ న్యూస్ ఎడిటర్ అమీర్ అలీ ఖాన్ జన్మదినం సందర్భంగా ముస్లీం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ మహ్మద్ జమాల్ షరీఫ్ అధ్వర్యంలో ఏక్ మినార్ మక్కా మసీదులో ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన ప్రతి అడుగులో విజయం సాధించాలని, ముస్లీంలకు మార్గదర్శిగా, నిజమైన మానవునిగా సమాజం, దేశం కోసం సేవ చేసే స్ఫూర్తిని అల్లాహ్ ప్రసాదించాలని ప్రార్థించారు. అనంతరం జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అరటిపండ్లు, ఇతర పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ వలీ, సుల్తాన్, సల్మాన్, అలీమ్, మౌలానా ముఫ్తీ అన్సార్, మహ్మద్ అబ్దుల్ మన్నాన్‌రాజీ,పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వీధి దీపాలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో ధర్మాపురం గ్రామానికి చెందిన చిత్తలూరి మధు అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుటమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మధు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో అధికారులు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

నుదుటి బొట్టు విషయంలోనూ భక్తుల ఆవేదన.భద్రకాళి దేవస్థానానికి వచ్చే భక్తులు అమ్మవారి దర్శనంతో పాటు.. హారతి అనంతరం నుదుటన బొట్టు పెట్టించుకోవడాన్ని పవిత్రంగా భావిస్తారు.. అమ్మవారి ఆశీస్సులుగా భావించే ఈ బొట్టు కోసం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఎదురుచూస్తుంటారు.. కానీ హారతి ముగిసిన తర్వాత బొట్టు పెట్టే పండితులు అందుబాటులో ఉండటం లేదని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సేవల పేరుతో ప్రైవేట్ వ్యక్తుల జోక్యంపై విమర్శలు..**

మరోవైపు.. దేవస్థానంలో సేవల పేరుతో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం పెరుగుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దేవస్థానానికి సేవ చేయడం, దాతలుగా సహకరించడం తప్పు కాదు.. అయితే ఆ పేరుతో సాధారణ భక్తులకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఏర్పడకూడదన్నది భక్తుల అభిప్రాయం..

**దాతల పేరుతో ఫొటోకాల్ దర్శనాలు..** నవరాత్రి ఉత్సవాల సమయంలో దేవస్థానానికి దాతలుగా వచ్చిన వారి పేరుతో వందల సంఖ్యలో ఫొటోకాల్ దర్శనా లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నా యి. కొంత మంది పూజారులు దాతల పేరుతో ప్రత్యేక ద ర్శనాలకు అవకాశం కల్పిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నా రు.దేవస్థానానికి విరాళాలు అందించే దాతలను గౌరవించ డం ఒక అంశమైతే.. అదే సమయంలో సాధారణ భక్తుల దర్శనానికిప్రాధాన్యం ఇవ్వడం మరో ముఖ్యమైన అంశం.

**ఆలయ పాలనలో మార్పులు ఎప్పుడు..?**

ప్రతి ఏటా ఉత్సవాలు జరుగుతున్నా.. భక్తులకు ఎదురవుతున్న సమస్యలు మళ్లీ మళ్లీ ఎందుకు తెరపైకి వస్తున్నాయి..? ఫిర్యాదులు చేసినా పరిష్కారం ఎందుకు లభించడం లేదు..? భక్తుల సౌకర్యాల కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలకు అధికారులు ఏం సమాధానంచెబుతారన్నదిఇప్పుడుచర్చనీయాంశంగామారిం ది.

**ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే**

మొత్తంగా.. భద్రకాళి అమ్మవారి దర్శనం కోసం వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత దేవస్థాన అధికారులపై ఉంది.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారా..? దేవస్థాన పాలనలో మార్పులు తీసుకొచ్చి సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందిస్తారా..? లేక భక్తుల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా..? అన్నది వేచి చూడాలి.

## అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. చారిత్రక కాకతీయుల రాజధాని ఓరుగల్లులో మహిళలు అంగరంగవైభవంగా జరుపుకున్న బతుకమ్మ సంబురాలు మిన్నంటాయి. వరంగల్, హన్మకొండ జంట జిల్లాల కేంద్రాలలోని పద్మాక్షమ్మ గుడి,వెయ్యి స్తంబాల గుడి,కాశీబుగ్గ, వరంగల్ ఉర్సుగుట్ట వద్ద బతుకమ్మ వేడుకలలో మహిళలు పెద్ద ఎత్తున వేలాదిగా పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన సద్దుల బతుకమ్మలతో రాత్రి వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో కొనసాగింది. ఆయా ప్రాంతాలలో రాత్రి వరకు బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు భారీ ఎత్తున వేడుకలు జరుపుకున్నారు. ఆడపడుచులంతా పల్లె ప్రాంతాల్లో దొరికే గునుగు, తంగేడు, గుమ్మడిపువ్వులు తీసుకువచ్చి బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో తొమ్మిదిరోజుల పాటు పూజలు చేసి తొమ్మదవ రోజు పోయిరా బతుకమ్మ అంటూ వీడ్కోలు పలికారు. చిన్నపెద్దలంతా కలిసి పట్టణంలో మహిళలు, యువతులంతా రంగురంగుల పువ్వుల కలర్లతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులంతా ఒక చోటికి చేరుకొని ఆటపాటలతో సందడిగా కోలాటాలు వేస్తూ పాటలు పాడుతూ.. ఆనందంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. తొమ్మిది రోజులు పూజలు చేసిన బతుకమ్మలను కోనేరులో నిమజ్జనం చేసి పోయిరా బతుకమ్మ పోయి రావమ్మా అంటూ బతుకమ్మలను నీళ్లలో నిమజ్జనం చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. దీంతో ఉమ్మడి జిల్లా అంతటా బతుకమ్మ వేడుకలు కన్నులపండువగా, అంగరంగవైభవంగా కొనసాగాయి. హనుమకొండ నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా దివారం రాత్రి ముగిశాయి. జిల్లా యంత్రాంగం, వరంగల్ నగర పాలక సంస్థ బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. హనుమకొండ 4వ డివిజన్ యాదవనగర్ చెరువుకట్టపై, 5వ డివిజన్‌లో హనుమాన్ నగర్‌లో కెనాల్ కట్టపై, వడ్డెపల్లిలోని చెరువు కట్టపై మహిళలు, యువతులు బతుకమ్మలతో పెద్ద ఎత్తున తరలివచ్చి నీళ్లలో నిమజ్జనం చేశారు.

## హసన్‌పర్తి పరిధిలో డాక్టర్ అదృశ్యం

### కేసు నమోదు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** వరంగల్ శాంతినగర్ కాలనీకి చెందిన సివిల్ సర్జన్ డాక్టర్ పున్నం రమేష్ బాబు (44) అదృశ్యమైనట్లు ఆయన భార్య సపర్తి కల్పన (న్యాయవాది) ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు కల్పన భర్త పున్నం రమేష్ బాబు హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా, పర్కాలలోని సూర్య డయాగ్నోస్టిక్స్‌లో రేడియాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆయన, ఈ నెల 16న డయాగ్నోస్టిక్ సెంటర్ వద్ద కొందరు రుణదాతలతో గొడవ జరిగిన అనంతరం హసన్‌పర్తిలోని ఇంటికి వచ్చారనీ అనంతరం అక్టోబర్ 17వ తేదీ మధ్యాహ్నం సుమారు 2:00 గంటల సమయంలో ఆయన ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదనీబంధువులు, స్నేహితులవద్దవిచారించినప్పటికీ ఆచూకీ లభించలేదని, ఆయన వద్ద ఉన్న రెండు ఫోన్లు స్విచ్ ఆఫ్ అయి ఉన్నాయని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.పున్నం రమేష్ బాబు (వయస్సు44) అడుగులురూపురేఖలు నల్లటి మేనిఛాయ, పొడుగు ముఖం, నల్లటి జుట్టు కలిగి ఉంటాడని,ధరించిన దుస్తులు నీలం రంగు జీన్స్ ప్యాంట్, నీలం రంగు షర్ట్ అని, ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి ఆచూకీ తెలిపిన వారు వెంటనే హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించగలరని ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ విజ్ఞప్తి చేశారు.

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గండ్ర

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తెలంగాణ ఆడపడుచుల గొప్ప పండుగ సద్దుల బతుకమ్మ పర్వదినం మరియు విజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముందస్తు శుభాకాంక్షలు



తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆడపడుచులంతా ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు తీసుకురావాలని కోరుకున్నారు.

## పాలకుర్తిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బతుకమ్మ సంబరాలు 9 రోజులు నిర్వహించుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో ఆయా ఊర చెరువుల వద్ద మహిళలు, పిల్లలు, పెద్దలు కోలాటాలతో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.గ్రామాలలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితి కార్యదర్శులు చెరువుల వద్ద విద్యుత్ దీపాలు అలంకరించి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ సంబరాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వర్ధన్నపేఏసిపి అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో పాలకుర్తి సీఐ భరత్ సుమన్, ఎస్ఐ సృజన్ కుమార్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు.

**రాయపర్తిలో:** తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడు



కలు మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. మండల కేంద్రంలోని మారెమ్మ చెరువు వద్ద మహిళలు బతుకమ్మలను ఉంచి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడి ఆడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.

**నర్సంపేటలో :** నర్సంపేట డివిజన్‌లోని అన్ని మండలాలల్లో ఆదివారం అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సంపేట పట్టణంలోని అంగడి సెంటర్ సద్దుల బతుకమ్మ వేడుకల కోసం



నర్సంపేట మున్సిపాలిటి అధికారులు, చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పా ట్లు చేశారు. డిజె సౌండ్స్ నడుమ, కొలాటాల మధ్యలో మహిళలు బ తుకమ్మ వేడులకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలతో మహిళలు అంగడి ప్రాంగణానికి భారీ సంఖ్యలో చేరడంలో గ్రౌండ్‌అంతా కిక్కిరిసిపోయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నర్సంపేట ఎసిపి రవీందర్‌రెడ్డి, సిఐ ముస్కు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు.

**ములుగులో:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా



నిలిచే బతుకమ్మ వేడుకలు ములుగు జిల్లాలో ఘనంగా ప్రారంభమయ్యాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాల కోసం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సర్పంచ్‌లు అవసరమైన ఏర్పాట్లు చేశారు. తెలంగాణ ఆడపడుచులు సాంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకల్లో వేలాది మంది మహిళలు పాల్గొని బతుకమ్మలను ఆడుతూ ఆనందంగా గడిపారు.

**పాపన్నపేటలో:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు వాడవాడలా సందడి చేశారు. బతుకమ్మ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో పల్లెలన్నీ పూలవనాలుగా మారి పండుగ శోభను సంతరించుకున్నాయి. అనంతరం మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి చిత్తు చిత్తుల బొమ్మ, శివుని ముద్దుల గుమ్మా, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, తబంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ జానపద గీతాలను ఆలపించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు. సాయంత్రం వేళ మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా స్థానిక చెరువుల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సంప్రదాయపాటలుపాడుతూ, వెళ్లి మళ్లీ రావే గౌరమ్మ తల్లి అంటూ బతుకమ్మలకు వీడ్కోలు పలికి నిమజ్జనం చేశారు.

## తండా ప్రజలకు డిజె సెట్ అందించిన శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని బంధన్ పల్లి గ్రామంలోని ప్రజల కోరిక మేరకు ఆదివారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజె సెట్‌ను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టి యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గుగులోత్ జాజు నాయక్, మాలోత్ వసంధర్, సంధి దేవేందర్ రెడ్డి, ఐరెడ్డి వెంకన్న, సంకినేని ఎల్లస్వామి, గుగులోత్ వాలు నాయక్, డెక్క అశోక్, చేవ్వా నారాయణ, కుసుంబ సంపత్, చుక్క రమేష్, రసూరి రాజకుమార్, ఎండి రహిమాన్, బర్ల యాకయ్య, బర్ల రామచంద్రు, డెక్క యాకయ్య, ఎలుకపెల్లి కుమార్, చెన్నూరి నరేష్, డెక్క నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నర్సంపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న త్రిశూల్ యూత్ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్, బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్, బిజెవైఎం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చదయాకర్, కొంకిసా విగ్నేష్ గౌడ్, ఠాకూర్ విజయ్ సింగ్ , అబ్బర బోయిన రాజు, చిలువేరు అన్వేష్, త్రిశూల్ యూత్ సభ్యులు కందగట్ల చిన్ని కృష్ణ , ఆముదాల శ్రీనివాస్, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం లోని తిమ్మంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నపెల్లి రాంబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్‌టిసెల్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అయ్యోరి యానయ్యను శాలువాతో కాంగ్రెస్ నాయకు లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు మాట్లాడుతూ, అయ్యోరి యానయ్య రాజకీయంగా అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రజల ఆ దరాభిమానాలను పొందే బలమైన నాయకుడిగా ముం దుకు సాగాలని ఆకాంక్షించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, అ న్ని వర్గాల ప్రజలను పార్టీతో మమేకం చేస్తూ ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ సభ్యుడు కొమురం బా లన్న ఎస్‌సిసెల్ మండల అధ్యక్షుడు బసారికారి హరికృష్ణ, చిన్నపెల్లి నర్సింహారావు, ఉజ్వల చారి, ఆక వెంకట్ రావు, ఆక సతీష్, బొంబోతుల మురళి, యగ్గడి అర్జున్, లొంక రాజు, గుండు నాగయ్య, ముంద్రాతి సాంబయ్య, ముక్కెర రజనీ, ముక్కెర రాజు, బొలుగొడ్డ సందీప్, గోమాసు లక్ష్మీనారాయణ, బోడ శివయ్య, బోగ పవన్, మల్లెల కమలాకర్, ముక్కెర రజనీకాంత్, పోగు రమేష్, కక్కెం రాజేష్ పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు కొత్త వస్త్రాలు ధరించి బతుకమ్మలను పేర్చి, ఆట పాటలతో సందడి చేశారు. బతుకమ్మ వేడుకలకు భూపాలపల్లి ఎంఎల్ఎ గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో కోలాటాలు వేశారు. చెల్పూర్, గణపురం, బుద్దారం, తదితర గ్రామాల్లో ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద పండగ బతుకమ్మ అని అన్నారు. ఆడపడుచులు ఆడుకునే బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. 17 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు హాజరై ఆడపడుచులతో కోలాటాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కావటి రజిత రవీందర్, కట్కూరి రాధిక శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, భూక్య సమ్మయ్య నాయక్, ఇంజపల్లి శ్రీనివాస్, విడిదినేని శ్రీలత అశోక్, తోట రాకేష్, ఎలుకపెల్లి రమేష్, పూజారి రాజేందర్, చింతకుంట్ల సునీత శ్రీనివాస్, తుమ్మల సంపత్, నాగరాజు, ఉడిప్ అరుణ్ కుమార్, ఉడుత సాంబయ్య యాదవ్, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న, ఉప సర్పంచ్‌లు మలహల్‌రావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని భూపాలపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ మోతె రాజు పటేల్ అన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేషాలపల్లిలో స్థానిక కౌన్సిలర్ మోతె రాజు పటేల్, టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజు పటేల్ మాట్లాడుతూ క్రీడలు మానసికల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని, ప్రతిభావంతులైన క్రీడాకారులు సమాజంలో గౌరవించబడతారన్నారు. క్రీడాకారులుగా ప్రతి రోజు క్రీడా మైదానాల్లోకి వెళ్లి వారికి ఇష్టమైన క్రీడలో నిత్య సాధన చేసినట్లయితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని సూచించారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిఏటా దసరా పండుగకు క్రీడలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

### గెలుపొందిన జట్లు ఇవే

11వ వార్డు వేషాలపల్లిలో గత రెండు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన చెట్లు మొదటి బహుమతి భాస్కర్ గడ్డ ఛాంపియన్ గెలుపొందగా, రెండవ బహుమతి భాస్కర్ గడ్డ ఏ జట్టు, మూడో బహుమతి వేషాలపల్లి వారియర్స్ గెలుపొందాయి. ఈ సందర్భంగా గెలుపొందిన చెట్లకు మొదటి బహుమతి 3,016, రెండవ బహుమతి 2,016, తృతీయ బహుమతి 1,016 16 నగదు బహుమానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ 11వ వార్డు మాజీ అధ్యక్షుడు దుండ్ర కుమార్ యాదవ్, మాజీ కౌన్సిలర్ బానోతు జుమ్మలాలు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు వేశాల రవీందర్, జాగరి అజయ్ యాదవ్, పోలవేణి ప్రసాద్, గురుజాల శ్రీనివాస్, కుదారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి ప్రశాంతంగా జరుపుకోవాలి: బాబూలాల్



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మండల పరిధిలో విజయదశమి వేడుక లు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆత్మకూరు ఇన్స్పెక్టర్ జి.బాబూలాల్ మండల ప్రజలను కోరారు.మంగళవారం జరగనున్న దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆయన గ్రామాల్లో నిర్వహించే జమ్మి పూజలు, పాలపిట్ట దర్శనం, అమ్మవారి శోభాయాత్రల్లో ప్రజలంతా ఐక్యంగా పాల్గొనాలన్నారు. ఎలాంటి ఘర్షణలకు, వివాదాలకు తావు ఇవ్వవద్దని సూచించారు.శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు పాటించాలని అతిక్రమించినచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు.

## క్రీడాస్ఫూర్తికి వేదికగా పత్తిపాక ప్రీమియర్ లీగ్



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ పట్టణంలో పత్తిపాక గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తిపాక ప్రీమియర్ లీగ్(పిపిఎల్) సీజన్ 2 ప్రారంభమైంది. తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, మాజీ ఎంపిపి గటిక అజయ్‌కుమార్ టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడి పోటీలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. యువతలో ఐక్యత, స్నేహభావం పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి నాయకుడు సీనియర్ న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్, టిఎం ఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు భారత రాష్ట్ర సమితి కారింగుల సురేష్ గౌడ్, నెక్కొండ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రం, దాసరి శ్రీనివాస్, తదితర నాయకులు, నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ నిర్మాణంపై మహిళల హర్షం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ చెరువు సమీపంలోని బతుకమ్మ ఘాట్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలకు సిసి ప్లాట్ ఫామ్ నిర్మించడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకుఎమ్మెల్యేదొంతి మాధవరెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పండగకు ముందే ప్లాట్‌ఫామ్ నిర్మాణం పూర్తి చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రత్యేక ఆకర్షణగా రావణ దహనం

రామ్ లీలా మైదానంలో ముమ్మరంగా ఏర్పాట్లు* పనులను పర్యవేక్షిస్తున్న హిందూ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు సర్పంచ్ సునీత కొమ్మాలునాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పింగిలి శ్రీనువాస్

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు వలంటీర్ల నియామకం



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే దసరా వేడుకలు రావణాసుర వధ కార్యక్రమాన్ని మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం స్థానిక అంగడి సెంటర్లోని రామ్ లీలా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను హిందూ ఉత్సవ కమిటి గౌరవ అధ్యక్షులు సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ హిందూ ఉత్సవ కమిటి అధ్యక్షులు పింగిలి శ్రీనువాస్ స్వయంగా పరిశీలించి పనులను వేగవంతం చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ఉత్సవాలను ఈసారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఒక ప్రత్యేక మైలురాయిగా చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుడుగు వేస్తున్నట్లు తెలిపారు. వేలాది మంది భక్తులు ప్రజలు తిలకించే ప్రధాన ఘట్టమైన భారీ రావణాసురుడి ప్రతిమ రూపకల్పన తుది దశకు చేరుకుందని దహన ఘట్టం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా అద్భుతమైన సాంకేతికత ప్రత్యేక బాణసంచా వెలుగుల నడుమ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులకు సకల సౌకర్యాలు వాలంటీర్లతో పర్యవేక్షణ ఉత్సవాలను వీక్షించేందుకు తరలివచ్చే అశేష జనవాహినికి ఎలాంటి అసౌకర్యం తోక్కిసలాట జరగకుండా రామ్ నీడ మైదానంలో ప్రత్యేక బారికేడ్లు పటిష్టమైన భద్రత తాగునీరు విద్యుత్ దీపాలంకరణ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని స్పష్టం చేవారు.వేడుకలను క్రమశిక్షణతో విజయవంతం చేయడానికి మైదానం నలుమూలలా సేవలందించేందుకు ప్రత్యేక వాలంటీర్ల బృందాలను రంగంలోకి దింఛుతున్నట్లు వివరించారు. ఈమహా ఘట్టాన్ని కనులారా వీక్షించి విజయదశమి వేడుకలను జయప్రదం చేసేందుకు గూడూరు మండల ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని హిందూ ఉత్సవ కమిటీ పక్షాన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా మాత అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు

**ప్రజాపక్షం/గజ్వేల్:** శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రసిద్ధ వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన శ్రీ విద్యాధరి అమ్మవారు శ్రీ దుర్గామాత అవతారంలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. తెల్లవారు జామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు అమ్మవారికి విశేషాభిషేకం, గణపతి పూజ, సుప్రభాతం, గిరి ప్రదక్షణ, అలంకారం, పంచ హారతులు, చతుషష్ఠ్యా పచార పూజ, రాజోప పచార పూజలు, చండీ హోమం తదితర పూజలతో పాటు ప్రత్యేకంగా అలంకరించారు. దుష్ట శిక్షణ శిష్ట రక్షణలో భాగంగా శ్రీ దుర్గా దేవి భక్తులను కాపాడుకోగా,



ఈ పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ పేర్కొన్నారు. కాగా ఈ పర్వదినాల్లో భాగంగా మాజీ మంత్రి హరీష్ రావు, శ్రీనిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వారికి అర్చకులు వేద ఆశీర్వచనం ఇవ్వడంతో పాటు శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, సిద్ధాంతి చంద్రశేఖర శర్మ నేతృత్వంలో ఆలయ అర్చకులు వారిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా, క్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. కాగా క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

## దుర్గా దేవి స్వరూపంలో విజయదుర్గ అమ్మవారు



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు దుర్గ దేవి స్వరూపిణిగా విజయదుర్గ భక్తులకు దర్శనమిచ్చింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాష్టమి వేడుకలు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

## వాడవాడల సద్దుల బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/కొండపాక :** సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలను మండల వ్యాప్తంగా అదివారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆయా గ్రామాల్లోని కూడళ్ల వద్ద పెట్టి పూజలు చేసిన అనంతరం మహిళలు బతుకమ్మ ఆటలాడారు. కొండపాక దమ్మక్కపల్లి మినహా అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆయా గ్రామాల్లో చెరువులలో నిమజ్జనం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీల వారు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

## మల్కాపూర్‌లో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



**ప్రజాఫక్షం/కొండాపూర్ :** కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామములో దేవి నవరాత్రులు భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు. అష్టమి రోజైన ఎనమిదవ రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలోదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతాప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్దలతో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళా మణుల ఆద్వర్యంలో సహస్రనామ పారాయణం, గౌడ్‌సంఘం ఆద్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమములో గ్రామస్థులు , భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

**ప్రజాపక్షం/కొండపాక :** దసరా పండుగను పురస్కరించుకొని గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామపంచాయతీ పాలకవర్గం దుస్తులను పంపిణీ చేసింది. పండుగ వేళ సిబ్బందిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. సిబ్బంది సేవలను గుర్తించి దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కొలుపుల గంగాధర్ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్ళకల్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు మనోహరాబాద్ మండలంలోని కళ్ళకల్ గ్రామంలో అంబరాన్ని తాకాయి. ఆదివారం గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో గుమిగూడి,రకరకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అత్యంత అందంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పాటలు ఆలపించారు. గ్రామ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా



అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా స్థానిక ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలంతా ఐకమత్యంతో జరుపుకోవడం ఈ వేడుకల ప్రత్యేకతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు భారీ ఏర్పాట్లు..



**ప్రజాపక్షం/రామాయంపేట:** బతుకమ్మ పండుగ వేళ మహిళలకు ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ పాలకవర్గం బారీ ఏర్పాట్లు చేసింది. రామాయంపేట పట్టణంలో ఆదివారం జరిగిన బతుకమ్మ వేడుకల కోసం మున్సిపాలిటి ప్రత్యేక చర్యలు చేపట్టిందిత. మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ కోసం చెరువుల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాట్లు చేశారు. కంకర రోడ్డుపై మహిళలు ఇబ్బందులు పడొద్దని మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు మల్లె చెరువు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. బతుకమ్మ నిమజ్జనానికి ఘాట్లు, మహిళలు సేదతీరేందుకు టెంట్లు, బతుకమ్మ ఆటలాడేందుకు అనువైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. గతంలో ఎదురైన సమస్యలను గుర్తించి ఈసారి పండగ కోసం ముందస్తు చర్యలు చేపట్టి సౌకర్యాలు కల్పించిన మున్సిపల్ చైర్మెన్‌ను స్థానికులు, మహిళలు అభినందించారు. పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవినాయక్, దేవుని రంజిత్, పుట్టి సందీప్, కోఅప్షన్ సభ్యులు దేమె యాదగిరి, కాంగ్రేస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, దాకి స్వామి, చింతల యాదగిరి, తౌంటవాలి యాదగిరి, బైరం కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రేగోడులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/రేగోడు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రేగోడు తో పాటు ఆయా గ్రామాలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తెల్లవారి జామునే లేసి ఇల్లు శుభ్రపరచుకొని తీరొక్క రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేరించి రకరకాల కూరగాయలతో చేసిన వంట పెరుగన్నం నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ గ్రౌండ్లో వాడ వాడలో ఆవరణలో బతుకమ్మలన్నీ ఒక్కచోట చేర్చి చుట్టూ సంప్రదాయ బద్దంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల, బతుకమ్మ పాటలతో ఊరంతా పండుగ వాతావరణం సంద



డిగా మారింది.ఈ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పలువురు పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. ఈ పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ పర్వీన్ సుల్తానా చోటు మియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు చిన్నలు యువతి యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఊరు దగ్గర్లో ఉన్న చెరువులో పోయి రావమ్మ మళ్ళీ రావమ్మా అంటూ పాటలు పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

## దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలకు 11వేల విరాళం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని పిల్లుట్ల గ్రామంలో దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు నిర్వహణ కోసం తన వంతు సహకారంగా పిల్లుట్ల గ్రామానికి చెందిన గుర్రాల ఆంజనేయులు రూ. 11వేల విరాళాన్ని ఆదివారం నిర్వహకులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి నవరాత్రుల ఉత్సవాలకు విరాళాలు అందించడం అభినందనీయం అన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈయేడు కూడా గ్రామస్థుల సహకారంతో దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలకు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. నవరాత్రుల ఉత్సవాల నిర్వహణ కోసం 11వేలు అందించిన గుర్రాల ఆంజనేయులు కుటుంబానికి ప్రతినిత్యం అమ్మవారి అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నట్టు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని ఉత్సవ కమిటి నిర్వహకులు హంసాన్‌పల్లి దినేష్‌రెడ్డి, గుల్లయ్యగారి వేణు, కుమ్మరి మహేశ్, మస్కురి కన్నయ్య, భవానిమాత భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎల్లగోని విక్రంగౌడ్ ఆద్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ ప్రధాన కూడలిలో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఊయ్యాలో అంటూ పాటల పాడుతూ ఆనందోత్సవాల మద్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ బతుకమ్మ వేడుకల్లో ప్రముఖ సింగర్ మంగ్లీ జంగిరెడ్డితో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో వేడుకను మహిళలతో కలసి ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మంగ్లీ పాటలతో బతుకమ్మ ఉత్సవాలు ఎంతో ఉల్లాసంగా కొనసాగాయి . గ్రామం ప్రదాన కూడలి హనుమాన్ మందిరం నుండి చెరువు కట్ట వరకు మహిళలు బతుకమ్మతో నడిచేందుకు గ్రీన్ మ్యాట్ ను ఏర్పాటు చేశారు. మహిళలందరూ బతుకమ్మ ఆడి గ్రామంలోని చెరువు లో వదిలేసీ వెళ్లి రావమ్మా అని వేడుకోలు పలికారు. సర్పంచ్ విక్రమ్ గౌడ్ బతుకమ్మ వేడుకలను అన్ని సదుపాయాలతో నిర్వహించారు. సింగర్ మంగ్లీతో పోటోలు దిగేందుకు మహిళలు యువకులు ఆసక్తిని చూపారు. గ్రామస్థులు సహకారంతో మునుముందు అన్ని వేడుకలను ఘనంగా జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం ,స్థానిక ఉపసర్పంచ్ గోరమియా, స్థానిక నాయకులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ మోటే సుమలత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం గ్రామంలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మోటీ సుమలత శ్రీకాంత్ ఆద్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సింగర్ ఆలపించిన పాటలకు అనుగుణంగా మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆటలు ఆడుతూ సంబరాల్లో మునిగిపోయారు. ధూం ధాం ఆటపాటలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. మహిళలు యువతులు, సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలను మరింత శోభాను తీసుకొచ్చారు. ఈ సందర్బంగా బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ,ఐక్యతకు , సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను బావితరాలకు అందించడంతో పాటు ప్రజల మద్య ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ కమీషనర్ వెంకట కిషన్‌రావు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు ,గ్రామ పెద్దలు మహిళలు యువతులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

## చెరువు వద్ద బతుకమ్మ మెట్లు ప్రారంభం



**ప్రజాపక్షం/చేర్యాల :** చేర్యాల మండలం ఆకునూర్ గ్రామపంచాయితీ పరిదిలోని ఎల్లమ్మ చెరువు వద్ద నిర్మించిన బతుకమ్మ మెట్లను ఆదివారం గ్రామ సర్పంచ్ కొమ్ము రవి పాలకవర్గం సభ్యులతో కలసి ప్రారంభించారు. చాలా సంవత్సరాలుగా గ్రామ ప్రజలకు మెట్ల నిర్మాణం లేక బతుకమ్మలను వెయ్యడానికి ప్రజలు తీవ్ర ఇబందులు పడుతున్న దృష్ట్యా, పాలకవర్గం సహకారంతో ప్రత్యేక చొరవతో అన్ని చెరువులకు మెట్లను అభివృద్ధి పరుస్తున్నట్లు సర్పంచ్ కొమ్ము రవి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, పాలకవర్గం సభ్యులు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ మెదక్ :** అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎరుకలి ఆశయ్య కుటుంబానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. హవేలి ఘనపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన ఆశయ్య మృతి వార్త తెలుసుకొని బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకుని స్పందించారు. ఆశయ్య అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ నిజ్జని లింగం ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మలిశెట్టి రాజయ్య, బద్దం రాంరెడ్డి, వార్డు సభ్యులు రాజ్యాల నవీన్, బుస్సా ఏసు, బుస్సా మహేష్, అంబాల హరీష్, కొమ్మటి సిద్ధయ్య, రాడ్వా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా స్నేహితులు

**ప్రజాపక్షం/నిజాంపేట్:** స్నేహమంటే ఆపదలో అండగా నిలవడమేనని నస్కాల్ గ్రామానికి చెందిన యువకులు నిరూపించారు. తమతో కలిసి చదువుకున్న కనకరాజు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. ఎస్ఎస్‌సీ 2005 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.36,900 సమకూర్చి, కనకరాజు కుమార్తె పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి కుటుంబ సభ్యులకు అందించారు. భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

## వైభవంగా శ్రీ దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డి పల్లి లో కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి ఆద్వర్యంలో మొట్టమొదటిగా నిర్వహించిన శ్రీ దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగాయి. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతప్రభాకర్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేంధర్‌రెడ్డి, కౌన్సిలర్ పొన్న దశరథ్ రెడ్డి, విఠల్ చిక్కుల మల్లేశం, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# పూల వనంగా తెలంగాణ పల్లెలు

### "అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు"



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** పూలను పేర్చి బతుకమ్మగా (దేవతగా) కొలిచారు. తెలంగాణ సంప్రదాయాలను పాటలను పలికించి పల్లెల్లో పండుగ శోభను నింపారు. ఆడబిడ్డల ఆటపాటలతో ఆనందాల హరివిల్లును విరబూయించారు. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగగా బతుకమ్మ పండుగ అని ప్రపంచానికి చాటి చెప్పారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగ చివరి రోజు సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. ధూల్మిట్ట మండలాల వ్యాప్తంంగా అన్ని గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ధూల్మిట్ట మండల కేంద్రంతో పాటుగా చారిత్రాత్మక గ్రామం వీరబైరాన్‌పల్లి, తోర్నాల, జాలపల్లి, బెక్కల్, కొండాపూర్, లింగాపూర్, కూటిగల్ గ్రామాలతో పాటుగా మద్దూరు మండల కేంద్రంతో పాటుగా, లద్నూర్, రేబర్తి, గాగిల్లాపూర్, వల్లంపట్ల, మర్మముల, సలాకపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాలకవర్గాల ఆద్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మహిళ ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ, అమ్మవారి స్వరూపమైన బతుకమ్మ ప్రతిఒక్క ఇంటిల్లి పాదిని చల్లగా చూడాలని, గౌరమ్మ తల్లి ప్రతి ఒక్క ఆడబిడ్డలకు కుంకుమ సౌభాగ్యాలు, ఆయూరారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు గుర్తు చేశారు.

## జగదేవ్‌పూర్‌లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** తొమ్మిది రోజులుగా మహిళలు అత్యంత భక్తిశ్రద్దలతో వివిధ రూపాలతో జరుపుకున్న బతుకమ్మ పండుగ చివరిగా ఆదివారం సద్దుల బతుకమ్మతో సంబురాలు జగదేవ్‌పూర్ మండలంలో అంగరంగా వైభవంగా జరిగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను గ్రామ ప్రధాన కూడళ్లలో పెట్టి మహిళలు సంప్రదాయ బద్దమైన నూతన వస్త్రాలు ధరించి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చిన్న పెద్ద తేడా లేకుండా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఆటపాటతో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక చెరువుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మళ్లీ వచ్చే ఏడాది ఇదే సంబురంతో రావాలని బతుకమ్మను వేడుకున్నారు. అనంతరం మహిళలు ఒకరికి ఒక్కరు వాయానాలు చెల్లించుకున్నారు.

## ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు యానయ్యకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం లోని తిమ్మంపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులుగా నియమితులైన అయ్యోరి యానయ్యను శాలువాతో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, అయ్యోరి యానయ్య రాజకీయంగా అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రజల ఆదరాభిమానాలను పొందే బలమైన నాయకుడిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, అన్ని వర్గాల ప్రజలను పార్టీతో మమేకం చేస్తూ ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ, చిన్నపెల్లి నర్సింహా రావు, ఉజ్వల చారి, ఆక వెంకట్ రావు, ఆక సతీష్, బొంబోతుల మురళి, యగ్గడి అర్జున్, లొంక రాజు, గుండు నాగయ్య, ముంద్రాతి సాంబయ్య, ముక్కెర రజనీ, ముక్కెర రాజు, బొలుగొడ్డు సందీప్, గోమాసు లక్ష్మినారాయణ, బోడ శివయ్య, బోగ పవన్, మల్లెల కమలాకర్, ముక్కెర రజనీకాంత్, పోగు రమేష్, కెక్కెం రాజేష్ పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీలక్ష్మి నృసింహ క్షేత్రంలో ఆదివారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరమాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి బెల్లంకొండ రంగాచారి నేతృత్వంలో ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. కాగా మొదటగా ఆలయ మర్యాదలతో పోలీస్ కమిషనర్ కు పూర్ణకుంభ స్వాగతం పలకగా, ఆమె వెంట అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నర్సింలు, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, ఎస్సై ఆరోగ్యం తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మనోహరాబాద్ మండలంలోని పరికిబండ గ్రామ సర్పంచ్ ఠాకూర్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ కోరారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలకు, మహిళలకు, ఆడపడుచులకు ఆమె ఆదివారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని, ప్రకృతిని పూల రూపంలో ఆరాధిస్తూ సంప్రదాయాలను కాపాడుకునే గొప్ప పండుగగా దీనికి విశిష్ట గుర్తింపు ఉందని పేర్కొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలతో మహిళలు జరుపుకునే సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, రైతులకు మంచి జరగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పరస్పర ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి ఉంటూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సర్పంచ్ ఠాకూర్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ అన్నారు.

## యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం / మెదక్ :** మెదక్ చర్చిలో ఆదివారం యూత్ సండే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రెసిబిటర్ ఇన్‌చార్జి డా. టి. శాంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫీనిక్స్‌కు చెందిన రెవ. జి. సురేష్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవ. జి. సురేష్ మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ, మంచి నడవడికతో క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. దేవునిపై విశ్వాసం కలిగి, ఆధ్యాత్మిక విలువలను పాటిస్తూ కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం ముగింపులో డా. టి. శాంతయ్య యువతకు ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ గురువులు డేవిడ్, రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్, స్థానిక సంఘ కార్యదర్శి గేలన్ చిత్తరాంజాన్, ట్రెజరర్ గంట సంపత్, స్టీవార్డులు ప్రభుదాయ, దేవాప్రకాష్‌తో పాటు సుశీల్, జాయ్ మూర్రే, శాంసన్, సునీల్, ప్రభుదాస్, వికాస్, మాని తదితరులు పాల్గొన్నారు.

## శివ పార్వతుల కల్యాణ మహోత్సవం పెద్ద ఎత్తున హాజరైన భక్తులు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ ,రెడ్డిపల్లి గ్రామాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని దుర్గామాత మండపంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, పుష్పమాలలు, తలంబ్రాలతో కళ్యాణాన్ని పూర్తి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించడానికి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు.కళ్యాణం అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సద్దుల బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట:** తెలంగాణ రాష్ట్రంలో తీరొక్క పూలను పూజించే సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేకువ జామునే లేసి తీరొక్క రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల ప్రధాన కూడలిలో బతుకమ్మలన్నీ ఒక్కచోట చేర్చి చుట్టూ సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో ఊరు ఊరంతా పండుగ వాతావరణం సందడిగా మారింది. ఈ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పలువురు పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. పండుగ సందర్భంగా గ్రామ సర్పంచులు బతుకమ్మ పండగలో ఎలాంటి లోటు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పండుగ సందర్భంగా గ్రామ పెద్దలు చిన్నలు యువతి యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఊరు దగ్గర్లో ఉన్న చెరువుల దగ్గరకు పోయి రావమ్మ మళ్ళీ రావమ్మా అంటూ పాటలు పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

## మెడిసిన్ విద్యార్థికి,ఐఐటి విద్యార్థినికి సన్మానం

### గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రం లోని నిట్ లో మంచి మా ర్యాంకు సాధించి మెడిసిన్ సీటు సాధించిన సాయినగర్ గురుకుల విద్యార్థి ఈరుణాల సాయికుమార్ సన్మానం తో పాటు 8000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. అదే విధంగా ఐఐటి బిలాయి లో సీటు సాధించిన బిక్క అక్షర కౌటభి గ్రామానికి చెందిన విద్యార్థిని సన్మానం చేయడం జరిగింది. కౌట భి గ్రామానికి చెందిన పారిశుద్ధ కార్మికుడు అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబానికి చెందిన గంగాధర్ వీరేష్ కు5000 రూపాయలను ఆర్థిక సాయం బోథ్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బోథ్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘ భవన షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో పద్మశాలి సంఘ భవన షెడ్డు నిర్మాణానికి బోత్ ఎమ్మెల్యే శ్రీ అనిల్ జాదవ్ ఆదివారం భూమిపూజ నిర్వహించారు.రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.పద్మశాలి సంఘ సభ్యులకు సమావేశాలు,సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ షెడ్డు ఉపయోగకరంగా ఉంటది అని అన్నారు. గ్రామంలో సామాజిక వసతుల కల్పనలో భాగంగా ఈ నిర్మాణం చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు,వివిధ గ్రామాల సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం 2002 — 2005 డిగ్రీ బ్యాచ్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రం లోని పొచ్చేర జలపాతం వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలురు అదిలాబాద్ 2002 to 2005h బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం 20 సంవత్సరాల తర్వాత నిర్వహించారు.ఆనాటి గురువులు చెప్పిన మాటలను ఆటపాటలను జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

## ముత్యం రెడ్డికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన దొడ్డికింది ముత్యం రెడ్డి ని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్,జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్,బీజేపీ సీనియర్ నాయకులు తక్కల రామారెడ్డి,జమాల్, పాల్గొన్నారు.

# చెన్నూరు గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

### గంగిపల్లి మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి




**ప్రజాపక్షం / జైపూర్ :** రానున్న శాసనసభ ఎన్నికల్లో చెన్నూరు గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని గంగిపల్లి మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో చెన్నూర్ మాజీ శాసనసభ్యుడు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అవినీతి, అక్రమాలను ఇంటింటికీ తెలియజేయాలని కోరారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరైన విద్యుత్ అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బాల్క సుమన్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల ప్రజాసేవలో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగారెడ్డి, లక్ష్మీ నారాయణ, తిరుపతి రెడ్డి, జగన్ గౌడ్, సాగర్, శ్రావణ్ కుమార్, మనోహర్ రెడ్డి, అంజిరెడ్డి, ఇతర గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# బాలాజీ ఆశీస్సులతో నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి

### మాజీ జడ్పి చైర్మన్ కోనేరు కృష్ణారావు



**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** బాలాజీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో సిర్పూర్ నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పి చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆకాంక్షించారు. ఆదివారం తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి చెందిన సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న దసరా వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన సౌత్ జోన్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** గత మూడు రోజులుగా ఎంతో ఉత్సాహంగా సాగిన సౌత్ జోన్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి.ఈ పోటీలలో మిక్స్ కేటగిరీలో తెలంగాణ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, పుదుచ్చేరి జట్టు ద్వితీయ, కేరళ జట్టు తృతీయ బహుమతులను సాధించాయి.పోటీల ముగింపు కార్యక్రమానికి గౌరవాధ్యక్షులు కే. భోజన్న,రాష్ట్ర అధ్యక్షులు విక్రమ్ ఆదిత్య రెడ్డి,విశిష్ట అతిథులుగా దేవీబాయి నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ అవినాష్, సాయి డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రమణ,టీజీపేట కార్యదర్శి వన్నెల భూమన్న,సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణ, ఉపాధ్యాయుల అసోసియేషన్ కార్యదర్శి సంజీవ్ పాల్గొన్నారు.అలాగే వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, సంజు, సురేష్, సౌజన్య, ఆర్గనైజర్ గస్కంటి గంగాధర్,సెక్రెటరీ లక్ష్మణ్ ,తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# సర్పంచ్ చెక్ పవర్ రద్దుపై నిరసన దీక్ష




**ప్రజాపక్షం/కుంటాల :** ఎమ్మెల్యే ఒత్తిళ్లతో కుంటాల మండలం కల్లూరు గ్రామ సర్పంచ్ దశరథ్ చెక్ పవర్‌ను అక్రమంగా రద్దు చేశారని ఆరోపిస్తూ ఆయన చేపట్టిన 48 గంటల నిరసన దీక్షకు బీఆర్ఎస్ నాయకురాలు డా. పడకంటి రమాదేవి పూర్తినైతిక మద్దతు తెలిపారు.తనకు న్యాయం చేయాలంటూ సర్పంచ్ చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా డా.పడకంటి రమాదేవి మాట్లాడుతూ ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. సర్పంచ్ దశరథ్‌కు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అధికారులు,పాలకుల వైఖరికి నిరసనగా న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. భైంసా మాజీ ఎంపీపీ రాజేశ్వర్,సిరిపెల్లి సర్పంచ్ సతీష్, లోకేశ్వరం నాయకుడు గంగాధర్, భైంసా నాయకులు అక్షయ్, సంపత్ పటేల్‌తో పాటు కుంటాల,నర్సాపూర్,కుబీర్,భైంసా మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు,బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్ దశరథ్‌కు మద్దతు తెలిపారు.

# భైంసా సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఛార్జింగ్

**ప్రజా పక్షం/భైంసా :** భైంసా డివిజన్ పరిధిలోని 33/11 కేవీ భైంసా ఐపీడీఎస్ ధనానివాలా సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పిటిఆర్) ను విజయవంతంగా ఛార్జింగ్ చేశారు.విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం,పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా ఈ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ/ఎంఆర్‌టీ,నిర్మల్ నిర్మాణ విభాగం అధికారులు,ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఒఎం) సిబ్బంది పాల్గొన్నారు.



## సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీష్ రావు సతీమణి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీష్ రావు సతీమణి శ్రీనిత పాల్గొని సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్‌నగర్, హౌజింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి హరీష్‌రావు సతీమణి శ్రీనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని వివిధ వార్డులలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు, మాజీ కౌన్సిలర్ కొండం కవిత సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ మచ్చ విజిత మచ్చ వేణు గోపాల్‌రెడ్డి, మహిళలతో కలిసి బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటల్లో పాల్గొన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలతో కలిసి ఆడుతూ పండుగ సందడికి మరింత ఉత్సాహం తీసుకొచ్చారు. ఈసందర్భంగా మాజీ మంత్రి సతీమణి శ్రీనిత మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. పూలను కొలుస్తు..ప్రకృతిని ఆరాధిస్తు బతకుమ్మ పండుగను తెలంగాణలో అత్యంత వైభవంగా ఘనంగా జరుపుకుంటారు. తాను ప్రతి యేట సిద్దిపేటలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనటం తనకేంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. బతుకమ్మ ఉత్సవాలను మహిళలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.
అనంతరం అత్యుత్తమంగా బతుకమ్మను పేర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఆనంతరం బతుకమ్మలను స్థానిక కోమటిచెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంజుల, మహిళా సంఘాల నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చౌటకూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



**ప్రజాఫక్షం/చౌటకూరు :** చౌటకూరులో గ్రామ సర్పంచు పార్కుల్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ,ఆటలు చిన్నారుల కేరింతలతో ఆనంతోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఆడిపాడారు. చిన్నారులు సైతం బతుకమ్మ ఆటల్లో పాల్గొని కేరింతలు కొట్టారు. ఈ వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పల్లె సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ నేటి ఆడపడచులు సద్దుల బతుకమ్మ పండగను ఆనందోత్సావాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువతీ యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్



**ప్రజాఫక్షం/సంగా-రెడ్డి :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద చెల్డా శివారులో గల సోలార్ పవర్ ప్లాంట్‌లో జరిగిన కేబుల్ దొంగతనం కేసును మునిపల్లి పోలీసులు చేధించారు. ఈ కేసులో ఎనిమిది మంది అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ నెలలో మర్పల్లి జోగిపేట పెద్ద చేల్దా ప్రాంతాలలో వరున చోరీలకు పాల్పడిన ఈ ముఠా దొంగలించిన వైర్ల నుండి తీసిన 125 కిలోల రాగిని జడ్చర్ల లోని ఒక స్క్రాప్ వ్యాపారికి రూ. 1,43,750 లకు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. సీసీటీపీ ఫుటేజీలు ,వాహనాల కదిలికల ఆదారంగా పోలీసులు ఈ ముఠా గుట్టు రట్టు చేసి నిందితులకు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# జనంతో కిటకిటలాడిన చెరువులు

జన సముంద్రమైన సిద్దిపేట కోమటిచెరువు

పోలీసుల భారీ బందోబస్తు.. ట్రాఫిక్‌ను మళ్లించిన పోలీసులు

పరిస్థితిని సమీక్షించిన సిద్దిపేట సిపి,ఏసిపి



**ప్రజాపక్షం /సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణసంస్కృతికి, సాంప్రదాయాలకు అద్దంపట్టే సద్దుల బతుకమ్మ పండగను జిల్లాలోని ఆయా గ్రామాల్లో మహిళలు ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా సాగిన బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా చివరిదైన సద్దుల బతుకమ్మను అంగరంగవైభంగా జరుపుకున్నారు. గునుగు, తంగెడు, పట్టుకుచ్చులు, గడ్డి, బంతి, చామంతి తదితర పూలతో తాంబులంలో బతుకమ్మను అందంగా పేర్చారు. చెరువుల వద్ద పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు, పెద్దలు తరలిరావడంతో జనంతో కిటకిటలాడాయి. తమ వెంట తెచ్చుకున్న (సద్దులు) పిండి వంటలు పరస్పరం ఇచ్చి ఆరగించారు.ఆనంతరం వాయనాలు పంచుకొని బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

**సిద్దిపేట జిల్లా కేంద్రంలో...**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబరాలను చివరి రోజు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడలీల వద్ద పెట్టి బతుకమ్మ పాటలు పాడి అడారు. జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్, దీకొండ మైసమ్మ ఆలయం, పారుపల్లివీధి, లాల్‌కమాన్, గాంధీ చౌక్, మార్కెట్ చౌరస్తా, శ్రీనివాస నగర్ కాలనీ, గంగాపుత్ర కాలనీ, గణేశ్‌నగర్, శంకర్‌నగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బతకమ్మలలు ఆడిన ఆనంతరం నిమజ్జనాలకు ఆటోలు, తోపుడు బండ్లలో కోమటిచెరువు, ఎర్రచెరువు,చింతల చెరువు,నర్సాపూర్ చెరువులకు తరలించారు. కోమటిచెరవు వద్ద బారీ గేట్లను నిర్మించారు. నిమజ్జనం కోసం తీసుకొచ్చిన బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే జిల్లాలో వివిధ మండలాల్లో సైతం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**✻ పకడ్బంధీగా ట్రాఫిక్ ఏర్పాట్లు**

కోమటి చెరువుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్, ఏసిపి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిస్థితిని సమీక్షించారు.

## సిద్దిపేట జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/గజ్వేల్:** సిద్దిపేట జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సరైన నీటి వనరులు ఉన్నప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందని విమర్శించారు. ఎల్నినో ప్రభావం సిద్దిపేట జిల్లాపై తీవ్రంగా ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందస్తు ఆదుకునే చర్యలు తీసుకోనీ పక్షంలో ఆత్మహత్యలు జరిగే ప్రమాదం ఉందని, గతాన్ని దృష్టిలో పెట్టుకొని ఎకరాకు



రూ 25 వేల పరిహారం ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మత్తులు చేపట్టలేదని, రైతులను ఆదుకునే ప్రత్యామ్నాయ చర్యలు కరువయ్యాయని అన్నారు. ఉపాధి హామీ కూలీల పని దినాలు పెంచాలని, ఉచితంగా నిత్యవసర వస్తువులు ఇవ్వాలని వివరించారు.

## మహా గౌరీ అవతారంలో ఏడుపాయల వన దుర్గ మాత

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఏడుపాయల వన దుర్గమ్మ సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దివ్యమంగళ రూపాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుండగా, ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగుతోంది. నిత్యం భక్తుల రాకతో ఏడుపాయల క్షేత్రం సందడిగా మారుతోంది. అనంతరం విశేష అలంకరణలో కొలువుదీరిన అమ్మవారికి పూజలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



**అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**

మంజీరా నది ఏడు పాయలుగా చీలి ప్రవహించే పవిత్ర క్షేత్రం లో కొలువుదీరిన వన దుర్గమ్మను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఉత్సవాల్లో ఆలయ సిబ్బ ంది ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, శ్రీనివాస్ రెడ్డి, రవి, యాదగిరి, మహేష్, రాజు, అర్చకులు, శం కర్ శర్మ, రాజేష్ శర్మ, రాజశేఖర్ శర్మ, పార్తివ శర్మలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## తాగునీరు విద్యుత్‌పై ప్రెస్ మీట్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** నారాయణ ఖేడ్‌కు తాగునీటి కొరత లేకుండా ఆడిషనల్ ఫండ్స్ ఇచ్చి ఆదుకుంటామని కలెక్టర్ తెలిపారని ఎమ్మెల్యే అన్నారు. పవర్ ప్రాబ్లం ఏక్కడ లేదు. గ్రౌండ్ వాటర్ పడిపోయి మోటర్ల మీద లోడ్ పడి మోటర్లు కాలిపోతున్నాయి. తప్ప ఎక్కడ కూడా లో ఓల్టేజ్ కరెంటు అంటూ లేదు. పిఎండి రెక్వెస్ట్ చేసి మా ప్రాంత రైతాంగం బోర్లపై నే ఆదారపడి ఉన్నారని తెలపడం జరిగింది. దానికి సానుకూలంగా స్పందించిన ఆయన ఖేడ్ అందోల్ నియోజకవర్గలకు అదనంగా 2 గంటల కరెంటు ఇస్తామని తెలిపారన్నారు. 15,20 రోజులైతే పంటలు చేతికి వస్తాయని అప్పటి వరకు రెండు గంటలు అదనంగా ఇవ్వాలని కోరామన్నారు. అది కూడా అరికట్టాలి 10,20 రోజులైతే పంటలన్ని చేతికి వచ్చి విద్యుత్ వాడకం తగ్గుతొందని అప్పటి వరకు ఒక్క యూనిట్ కూడా వేస్ట్ చేయకూడదని ఆయన తెలిపారు.

## మహిళ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని మునిసిపల్ 8.9.10 వార్డుల్లో అందంగా బతుకమ్మలను పేర్చిన ఐదుగురు మహిళలకు పట్టుచీరలు మరో 50 మంది మహిళలకు కన్సొలేషన్ బహుమతులను సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అందజేశారు. మహిళలను బిఆరెస్ ప్రభుత్వం అవమానించిదన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది అని ఆరోపించారు. మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబన



కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు వివరించాలి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అమలు చేస్తుంది అని అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గయాజుద్దీన్. అజ్మత్ విజయ డానియల్ నజ్జు ముద్దు రవితేజ అజారుద్దీన్ కుమార్ సాయి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** తెలంగాణ రాష్ట్రంలో తీరొక్క పూలను పూజించే సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేకువ జామునే లేసి ఇల్లు శుభ్రపరచుకొని స్నానాసంధ్యాలు ముగించుకొని తీరొక్క రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అనంతరం రకరకాల కూరగాయలతో చేసిన వంట పెరుగన్నం నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు అల్లాదుర్గం, చేవెళ్ల, బహిరన్ దిబ్బ, ముప్పారం, ముస్లాపూర్, గడి పెద్దాపూర్, రాంపూర్, అప్పాజీపల్లి, నీలకంటిపల్లి, సీతానగర్ ,కాగితం పల్లి, రెడ్డిపల్లి, వెంకట్రావుపేట్ గ్రామాల ప్రధాన కూడలిలో బతుకమ్మలన్నీ ఒక్కచోట చేర్చి చుట్టూ సంప్రదాయబద్దంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో ఊరు ఊరంతా పండుగ వాతావరణం సందడిగా మారింది.ఈ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పలువురు పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. పండుగ సందర్భంగా గ్రామ సర్పంచులు బతుకమ్మ పండగలో ఎలాంటి లోటు జరగకుండా అన్నిచిన్నలు యువతి యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఊరు దగ్గర్లో ఉన్న చెరువులలో పోయి రావమ్మ మళ్ళీ రావమ్మా అంటూ పాటలు పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



## 6 లక్షల రూపాల నోట్లతో అమ్మవారి అలంకరణ

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** దేవి శరన్నవరాత్రు ఉత్సవాలలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ పరిధిలోని బట్టి రామన్నపల్లిలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారు లక్ష్మీ దేవి అవతారంగా దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా గ్రామ యువకులు సుమారు ఆరు లక్షల రూపాయల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బిజెవైఎం జిల్లా కమిటీ నియామకం...

**ప్రజాపక్షం/సిద్దిపేట ఆర్బన్:** మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఆదేశాలు,జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ సూచనల మేరకు ఆదివారం భారతీయ జనతా యువ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని నియమించినట్లు బిజెవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల నాగరాజు తెలిపారు. బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులుగా మల్లుగారి రమణారెడ్డి,సుంకపాక ప్రశాంత్,బబ్బూరి రవీందర్ గౌడ్,దుబ్బాక తిరుమలేష్ గౌడ్,యెల్ల మధుసూదన్,కంది సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పాపగొని సదానంద గౌడ్,దాసరి కళ్యాణ్ దాస్ ముదిరాజ్,కార్యదర్శులుగా వేముల భరత్,బర్ల రంజిత్ కుమార్,ఇటుకాల కుమారస్వామి,బీరకాయల వివేకవర్ధన్,కోశాధికారులుగా కాసనగొట్టు శంకర్ లింగం,మామిడాల మణికంఠ యాదవ్,ఆఫీస్ సెక్రటరీగా మురికి అనీష్,
మీడియా కన్వీనర్‌గా బొగ్గుల సంతోష్ కుమార్,మీడియా కో కన్వీనర్ గా వేములవాడ మహేష్ చారి,సోషల్ మీడియా కన్వీనర్‌గా సుతారి కార్తీక్,సోషల్ మీడియా కోకన్వీనర్లుగాగా రాయపోల్ ఆనంద్ సాయి,రాగిశెట్టి సురేందర్ గౌడ్, ఐటీ కన్వీనర్‌గా కాసాని సతీష్ లను నియమించినట్టు అధ్యక్షుడు ప్రకటించారు.

## తెలంగాణ సంస్కృతికి సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/శివ్వంపేట : తెలంగాణ సంస్కృతికి సాంప్రదాయానికి ప్రతీక సద్దుల బతుకమ్మ అని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోమారం గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలసి రంగురంగుల పువ్వులతో ఆమె బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండగను ప్రజలందరు సంతోషంగా జరుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రపంచంలో ఇలాంటి సంస్కృతి మన తెలంగాణలో మాత్రమే ఉందని తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ బతుకమ్మ పండగను అధికారికంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ చంద్రాగౌడ్, వాకిటి హనుమంతురెడ్డి, భిక్షపతిరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ

**ప్రజాపక్షం/రామాయంపేట:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రామాయంపేట మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను సాయంత్రం వేళ మహిళలు దుర్గామాత మండపాలు, గ్రామ ప్రదాన కూడళ్ల వద్దకు చేర్చి బతుకమ్మ పాటలతో ఆటలాడుతూ వేడుకల్లో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్బంగా కుటుంబసభ్యులు, బందుమిత్రులు ఒకేచోట చేరడంతో పండగ వాతావరణం నెలకొంది. రామాయంపేట పట్టణంలో గాందీ విగ్రహం, మహాంకాళీ దేవాలయం, మల్లన్న కాలనీ, రెడ్డి కాలనీ, దుర్గమ్మ బస్తీ, బీసీ కాలనీతో పాటు కోనాపూర్, ఆర్. వెంకటాపూర్, రాయిలాపూర్, సుతారిపల్లి, ఝాన్సీలింగాపూర్, అక్కన్నపేట, తొనిగండ్ల, కాట్రియాల, లక్ష్మాపూర్, పర్వతాపూర్ తదితర గ్రామాల్లో బతుకమ్మ పండుగ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. చెరువుల వద్ద అన్ని రకాల సౌకర్యాలను మున్సిపల్, పంచాయతి అధికారులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.